# నా సాహితీ జీవనంలో జరిగిన కథ

## మల్లాది వెంకట కృష్ణమూర్తి



కేవలం 'కౌముది' పాఠకుల కోసమే మల్లాది గారు మొట్టమొదటి సారిగా వ్రాస్తున్న సంచలనాత్మక శీర్షిక

*1970 నుంచి సాహిత్య మార్గంలో నాకు ఎదురైన అనేక సంఘటనలని, అనుభవాలని పాఠకులతో పంచుకోవడానికి ఈ శీర్షికను ఆరంభిస్తున్నాను. తరచూ నన్ను పాఠకులు అడిగే అనేక ప్రశ్నలకి జవాబులు ఇందులో దొరుకుతాయి. నాకు ఈ మార్గంలో పరిచయం ఉన్న అనేకమంది ప్రముఖుల గురించి రాసే వివిధ విషయాలు, వారితో నా అనుభవాలు చదవడానికి పాఠకులకి ఆసక్తిగా ఉంటాయని విశ్వసిస్తున్నాను. నాకు డైరీ రాసే అలవాటు లేదు కాబట్టి తారీఖులు, నెలలు, సంవత్సరాలు, కొందరి పేర్లు అన్ని సందర్భాల్లోనూ ఇవ్వలేను. అందుకని కేవలం జరిగిన వాటి సారాంశాలని మాత్రమే ఇవ్వగలను. ఎలాంటి దాపరికాలు లేకుండా రాయదలచుకున్నాను కాబట్టి పాఠకులు దీన్ని కల్పితంగా భావించనవసరం లేదు. ఏ విషయం మీదైనా వారు ఇంకాస్త వివరాలు తెలుసుకోడానికి ప్రశ్నలు వేయచ్చు. అలాగే ఏ విషయం మీద తెలుసుకోవాలని ఉందో దాన్ని అడిగితే ఆ వివరాలు రాస్తాను. అయితే ఓ టాపిక్కు ముగిసేదాకా ఆగి దాని మీద నేను చెప్పనివాటి గురించి అడిగితే ఎవరికీ సమయం వృధాకాదు. మీరు టాపిక్కులని సూచించవచ్చు. నేను రాయదలచుకున్న జాబితాలో అవి ఉంటే సరే. లేకపోతే మిగతా పాఠకులకి, నాకు ఈ విషయంలో సహాయం చేసినవారు అవుతారు. అనుమానం ఉన్న సంగతులని వదిలేయదలిచాను కాని అసత్యాలని మాత్రం రాయదలచుకోలేదు. కొందరికి ఇవి బాధని కలిగించవచ్చు. కాని సత్యానికి దగ్గరగా ఉండాలంటే ఇది తప్పదు.* - మల్లాది

When I was a little boy, they called me a liar. But now that I am grown up, they call me a writer.

- Issac Bashevis Singer

## శ్రీ వాకాటి పాండురంగారావు



శ్రీ వాకాటి పాండురంగారావు

**శ్రీ వాకాటి పాండురంగారావు పేరు ఆంధ్రప్రభ వార పత్రికలో** నా టీన్స్‌లో అనేక కథలు చదవడం ద్వారా కథకుడిగా మాత్రమే నాకు తొలుత పరిచయం. తర్వాత ఆయన న్యూస్ టుడేలో పని చేస్తూండగా 'ఈనాడు' ఆఫీసులో చలసాని ప్రసాదరావుగారు చూపించి 'పెద్ద మనిషి' అని చెపితే, దూరం నుంచి చూసాను. చలసానిగారు మంచివారు అనడానికి 'పెద్ద మనిషి' అనే పదాన్ని ఉపయోగించేవారు. అందులో ఎంతో నిజం ఉందని నాకు తర్వాత శ్రీ వాకాటితో పరిచయం అయ్యాక తెలిసింది.

1990లో ఓ రోజు నాకు ఫోన్ చేసి తను ఆంధ్రప్రభ వారపత్రికకి ఎడిటర్ అయ్యానని, సీరియల్ కావాలని కోరారు. అప్పుడే కొత్తగా అమెరికా వెళ్ళి వచ్చాను కాబట్టి ఆ నేపథ్యంలో అల్లుకున్న లవ్ స్టోరీని చెపితే, ఆయనకి అది నచ్చింది. 'అంకుల్ సామ్' పేర దాన్ని ప్రభ వీక్లీలో సీరియల్‌గా రాసాను. ఆయన రాసిన 'మిత్ర వాక్యం' అనే సంపాదకీయం చాలా ప్రసిద్ధి చెందింది. 'మరణం ఒక కామా' అనే పేరుతో వచ్చిన వ్యాస పరంపర కూడా చాలా మందిని ఆకర్షించింది. ఈ రెండూ 'దిక్సూచి' అనే మరో వ్యాస పరంపర పుస్తకాలుగా వెలువడ్డాయి. నేను కలిసిన ఎడిటర్స్‌లో శ్రీ వాకాటి మంచి మేధావి అని త్వరలోనే తెలుసుకున్నాను. ఆయన ఓసారి అన్న మాటలు ఈనాడు నిజం అవడం ఆశ్చర్యం. 'వచ్చే శతాబ్దంలో ముస్లిమ్‌లకి, అమెరికాకి మధ్య తీవ్ర యుద్ధం మొదలయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. కొంతకాలానికి అది ఛాందస ముస్లిమ్, ఛాందస క్రిస్టియన్ యుద్ధంగా మారిపోతుంది' అని చెప్పారు.

"ప్రపంచంలోని ఏ విషయం మీదైనా మాట్లాడమని నన్ను కోరితే ఆ టాపిక్ మీద గంట సేపు మాట్లాడే సత్తానాకుంది" అని మరో సందర్భంలో ఆయన చెప్పిన మాటలు గుర్తున్నాయి.

చక్కటి కుటుంబ నేపథ్యం నుంచి వచ్చిన, ఎలాంటి చెడు అలవాట్లు లేని శ్రీ వాకాటి అన్ని విషయాలలో సూటిగా ప్రవర్తించేవారు. నా సీరియల్స్‌కి మంచి స్పందన వస్తే కొందరు ఎడిటర్స్‌లా దాన్ని దాచకుండా నాకు చెప్పేవారు. ఆంధ్రప్రభ డైలీ ఎడిటర్ వాసుదేవ దీక్షితులుగారిని వాకాటి గారే నాకు పరిచయం చేసారు. శ్రీ వాసుదేవ దీక్షితులు డైలీకి సీరియల్ అడిగితే 'రేపో మాపో పెళ్ళంట' 'గ్రీన్ కార్డ్' రాసాను. ప్రభ చేతులు మారేదాకా ఆయనే డైలీ ఎడిటర్‌గా ఉన్నారు. తరువాత జి.శ్రీరామ్మూర్తి గారు వచ్చారు. ఆయనతో నాకు పరిచయం పెద్దగా లేదు. ఇప్పుడు ఆయన సూర్య డైలీ ఎడిటర్‌గా పనిచేస్తున్నారు.

అప్పట్లో వీక్లీ ఎడిటర్స్‌ని నెల జీతం మీద కాక కాంట్రాక్ట్ పద్ధతిలో తీసుకునేవారు. ఓ రోజు నాతో వాకాటిగారు తన కాంట్రాక్ట్ పూర్తయిందని, ప్రభ వీక్లీనుంచి వెళ్ళిపోతున్నానని, ఎక్స్‌టెన్షన్ ఇస్తారని ఆశిస్తున్నానని, తనకు జీతం అవసరం ఉందని బాధగా చెప్పారు. కాని వారికి ఎక్స్‌టెన్షన్ రాలేదు. ఆ తర్వాత 1998లో అనుకుంటా ఆయన పోయిన సంగతి దిన పత్రికల్లో చదివాను.



శ్రీ ఇంద్రగంటి శ్రీకాంత శర్మ

## శ్రీ ఇంద్రగంటి శ్రీకాంత శర్మ

శ్రీ వాకాటి తర్వాత శ్రీ ఇంద్రగంటి శ్రీకాంత శర్మ ప్రభ వీక్లీకి ఎడిటర్‌గా వచ్చారు. శ్రీకాంత శర్మగారితో నాకు మద్రాస్‌లో సుత్తి వీరభద్రరావు ఇంటి ముందు పేవ్‌మెట్ మీద పరిచయం. వీరభద్రరావు పోయినప్పుడు నేను మద్రాస్‌లోనే ఉన్నాను శ్రీకాంత శర్మ, వీరభద్రరావు విజయవాడలో ఆల్ ఇండియా రేడియోలో కలిసి పనిచేసారు. దాంతో వీరభద్రరావుని చూడడానికి విజయవాడ నుంచి శర్మగారు వచ్చారు. నేను శ్రీ ఆదివిష్ణు, శ్రీ జంధ్యాల మొదలైనవారితో కలిసి వీరభద్రరావు ఇంటికి వెళ్ళినప్పుడు బయట పేవ్‌మెంట్ మీద కూర్చుని ఉన్న శ్రీ శ్రీకాంత

శర్మని శ్రీ జంధ్యాల పరిచయం చేసారు. శ్రీ జంధ్యాల తీసిన ' నెలవంక' సినిమాలో అప్పటికే ఆయన ఓ పాట రాసారు. నేను పేవ్‌మెంట్ మీద ఆయన పక్కనే కూర్చున్నాను. ఇద్దరం కొద్దిసేపు మాట్లాడుకున్నాం. ఆయన కల్లాకపటం లేని చక్కటి స్నేహశీలి అని నాకు అనిపించింది.

వారిది సాహితీ కుటుంబం. వారి తండ్రి ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి మంచి కథకుడు. ఆయన గౌతమి గాథలు (కథలు?) చాలా మంచి కథలు. శ్రీకాంత శర్మ భార్య జానకీబాల కూడా రచయిత్రి. వారబ్బాయి మోహన్ కృష్ణ మంచి దర్శకుడు. ' గ్రహణం' సినిమాతో అతను దర్శకుడు అయ్యాడు.

శ్రీ ఇంద్రగంటి శ్రీకాంత శర్మని ప్రభ వీక్లీకి కొత్త ఎడిటర్‌గా శ్రీ వాసుదేవ దీక్షితులు నాకు పరిచయం చేయగానే శర్మగారే మా మొదటి కలయిక గురించి గుర్తుచేసారు. తర్వాత వారపత్రిక ఆఫీసులోని తన కేబిన్‌కి తీసుకెళ్ళారు. ఆంధ్రప్రభ వీక్లీలో ఏదైనా శీర్షిక రాయమని కోరితే మర్నాడు దాన్ని డిజైన్ చేసి తీసుకెళ్ళి చూపించాను. దాన్ని ఆయన ఓకే చేసారు. ' తెర - కత్తెర' అనే కాలక్షేపం పేజీని వీక్లీలో ప్రారంభించాను. అందులో అనేక చౌ చౌ శీర్షికలు ఉండేవి. నేడు చాలా సన్డే సప్లిమెంట్స్‌లో వచ్చేలాంటి శీర్షికలవి. అప్పట్లో ఇంటర్నెట్ లేదు. వాటిని వివిధ అమెరికన్ పత్రికల నుంచి సేకరించేవాడిని. ఇందుకోసం విద్యాసాగర్ అనే, వాషింగ్‌టన్ డిసిలోని ఓ పరిచయస్థుడిని కోరితే అతను నేను కోరిన పత్రికలకి చందాకట్టి ఇండియా వచ్చినప్పుడల్లా తీసుకువచ్చేవాడు అతనికి రూపాయిల్లో మారకం చెల్లించేవాడిని. అతను తన తల్లిని చూడటానికి ఏడాదికోసారి వచ్చేవారు.

' తెర - కత్తెర'లో ఓ సినిమా క్విజ్ ఉండేది. నేషనల్ ఎంక్వయిరర్ అనే ఓ వారపత్రికలోని హాలీవుడ్ సినిమా క్విజ్‌ని కాపీ కొట్టి దాన్ని రూపొందించాను. అందులో బహుమతి పొందిన గ్రహీతకి 'అంకుల్ సామ్' పుస్తకం బహుమతిగా రిజిస్టర్ బుక్ పోస్ట్‌లో పంపేవాడిని. చాలా పత్రికల సిబ్బంది శ్రద్ధగా విజేతలకి బహుమతులు పంపరని చెపితే, 'మనం అలా చేయద్దు' అని ఆ బాధ్యతని నన్నే తీసుకోమని నా కిచ్చే పారితోషికంలో బహుమతి మొత్తం కూడా కలిపి ఇస్తామని శ్రీ శ్రీకాంతశర్మ చెప్పారు. అయితే పాఠకుడు బహుమతి అందలేదని ఫిర్యాదు చేస్తే మాత్రం ఆ బాధ్యత నాదే అని కూడా చెప్పారు. దాంతో పజిల్‌కి సమాధానం పంపడానికి మా ఇంటి అడ్రస్‌నే ఆ శీర్షికలో ఇచ్చారు.

త్వరలోనే ' గగనసీమ' అనే అమెరికా నేపథ్యంలో మరో ప్రేమకథని ప్రభ వీక్లీకి సీరియల్‌గా రాసాను. సీరియల్ మొదలవగానే, ' తెర-కత్తెర' ఆపేయమని శ్రీ శర్మ కోరారు.

మా ఇంటికి ఓ వారం వచ్చిన పోటీలో పాల్గొన్న పాఠకుల కార్డ్‌లని తీసుకెళ్ళి ఇచ్చాను. ఆ వారం 750 కార్డులు వచ్చాయి! అప్పటికే మా పోస్ట్ మాస్టర్ నాకు కబురు చేసి పని భారం పెరుగుతోందని నాకు వారి సూపరింటెండెంట్ నోటీస్ ఇవ్వబోతున్నారని చెపితే, ఆ నోటీస్‌ని ప్రభ ఎడిటర్‌కి పంపమని నా అడ్రస్‌కి అన్ని కార్డులు ఎందుకు వస్తున్నాయో వివరంగా చెప్పాను. శ్రీ శర్మకి అప్పటికే పోస్టల్ సూపరింటెండెంట్ నుంచి ఆ నోటీస్ వెళ్ళింది.

ప్రభలో ఆయన దగ్గర అసిస్టెంట్ ఎడిటర్‌గా పనిచేసే శ్రీరమణ సలహా మీద శర్మగారు తను దాన్ని ఆపదలచుకున్నానని చెప్పారు. అంతటి ఆదరణ ఉన్నా శ్రీ శ్రీరమణ దాన్ని ఆపాలని పట్టుబట్టడంతో విసిగి నేను ఇక చర్చించలేదు. తర్వాత మరో సీరియల్ 'టచ్ మీ నాట్' కూడా రాసాను. శ్రీ ఇంద్రగంటి శ్రీకాంతశర్మ భావుకత, మంచితనం కలబోసిన మనిషి. ఎవరి గురించీ ఆయన చెడు మాట్లాడగా నేను వినలేదు. తన కొడుకు మోహన్ కృష్ణ కెనడాలోన్ టొరంటో యూనివర్శిటీలో సినిమా డైరెక్షన్ కోర్స్‌లో చేరాడని ఓ రోజు చెప్పారు.

తర్వాత ఆయన కాంట్రాక్ట్ కూడా ముగియడంతో శ్రీ ఇంద్రగంటి ప్రభ నుంచి వెళ్ళిపోయారు. ఆ తర్వాత ఒకటి రెండు సార్లు ఫోన్‌లో మాట్లాడుకున్నాం. 2009లో హైదరాబాద్ హిమాయత్ నగర్‌లోని హోటల్ ఉడ్ లేండ్‌లో అమెరికా నుంచి వచ్చిన శ్రీ చిట్టెన్

రాజు నిర్వహించిన ఓ సాహితీ మీటింగ్‌లో శ్రీకాంత శర్మ చాలా కాలం తర్వాత కలిసారు. అదే ఆప్యాయతతో ఎంతో ప్రేమగా మాట్లాడారు. ఆయన మనుషుల్ని ప్రేమిస్తారు.

## శ్రీ శ్రీరమణ




శ్రీ ఇంద్రగంటి శ్రీకాంతశర్మ ఆలిండియా రేడియోలో చేరక మునుపు ఆంధ్రజ్యోతి వీక్లీలో కొద్దికాలం ఎడిటోరియల్ శాఖలో పనిచేసారు. అప్పుడు ఆయనతో పాటు పని చేసిన శ్రీరమణని తన అసిస్టెంటుగా ప్రభ వీక్లీలో తీసుకున్నారు. నాకు శ్రీరమణ గారితో పరిచయం అక్కడే నాకు కథ పేరు గుర్తు లేదు కాని కొద్దివారాల క్రితం ప్రభలో వచ్చిన కథ గురించి ప్రస్తావించి, 'ముగింపు అలా చేసారే?' అని శ్రీ రమణ ప్రశ్నించారు. 'ఇంగ్లీష్ కథని అలాగే ముగించారు కాబట్టి' అని నవ్వుతూ జవాబు చెప్పాను. తను శ్రీ బాపు దగ్గర ఉండేవాడినని, ఆయన ఈటీవికి భాగవతం సీరియల్ తీస్తున్నారని, దాంతో తను ఖాళీగా ఉండటంతో ఈ ఉద్యోగంలో చేరానని శ్రీరమణ చెప్పారు.


శ్రీ వల్లూరి రాఘవరావు

ఇంద్రగంటి శ్రీకాంత శర్మ కూడా ప్రభ నుంచి వెళ్ళిపోయాక, శ్రీ వల్లూరి రాఘవరావుని అకస్మాత్తుగా వీక్లీ ఎడిటర్‌ని చేసారు. అతను మేనేజ్‌మెంట్‌లో ఎవరో బాగా తెలిసిన వారి ద్వారా వచ్చారని శ్రీ రమణ చెప్పారు. శ్రీ వల్లూరి శ్రీ ఇంద్రగంటిని, శ్రీ రమణని అంతకు ముందు కలిసి కథలు ఇస్తూండేవారు. అతని కింద పనిచేయడం ఇష్టంలేక శ్రీ రమణ ఇబ్బంది పడేవారు. త్వరలోనే శ్రీ రమణ ప్రభ వీక్లీలో ఉద్యోగం మానేసారు. కొద్దికాలం ఖాళీగా ఉన్నారు. ఓ రోజు శ్రీ రమణ ఫోన్ చేసి ఆంధ్రజ్యోతి యాజమాన్యం ఆంధ్రజ్యోతి వీక్లీని నవ్య అనే కొత్త పేరుతో తిరిగి తీసుకు వస్తున్నారని, తనని ఎడిటర్ గా నియమించారని చెప్పి, ఓసారి కలవమని కోరారు. అప్పట్లో ఆంధ్రజ్యోతి ఆఫీస్ బంజారాహిల్స్‌లో హిందూ స్మశానవాటిక ఎదురు బిల్డింగ్‌లో ఉండేది. రెండో అంతస్తులోని ఆయన్ని నవ్య సెక్షన్‌లో కలిసాను. సీరియల్ కావాలని కోరారు.

చాలా కాలంగా శ్రీ కొమ్మూరి సాంబశివరావు నవలని ఆధునీకరించాలనే కోరిక నాకు ఉంది. ఎందరో ఎడిటర్స్‌కి ఇది సూచించాను కానీ ఎవరూ అంగీకరించలేదు. శ్రీ రమణగారికి అది చెప్పి, అగాథ క్రిష్టీ లాంటి బ్రిటిష్ రచయిత్రుల నవలలు నేటి పరిస్థితులకి అణుగుణంగా తిరగ రాసారని, అలా కొమ్మూరి నవలని నేటి కాలానికి అనుగుణంగా ఆధునీకరించి రాస్తానని చెప్పాను. ఆయనకి ఒకప్పటి పాఠకుల్లో కొమ్మూరి రచనల మీద గల ఆదరణ గురించి తెలుసు. కొద్దిరోజుల తర్వాత దాన్ని ఆయన ఓకే చేసారు. ఇలాంటి ప్రక్రియని ప్రవేశపెట్టిన ఘనత తనకి వస్తుందన్న భావన వల్ల ఆయన దానికి అంగీకరించారు అని ఆయన మాటల వల్ల నాకు అనిపించింది. దాంతో కొమ్మూరి నవలల్లో నాకు బాగా వచ్చిన 'ప్రాక్టికల్ జోకర్'ని ఆయన కొడుకు శ్రీ వెంకట్‌తో మాట్లాడి అనుమతి తీసుకుని తిరగరాసాను. అణాలు, బేడలు బదులు పైసలు, చెవర్లెట్, స్టుడీబేకర్ కార్ల స్థానంలో మారుతీ కార్లు.. అప్పట్లో శ్రీ కొమ్మూరి నెలనెలా విడుదల చేసే నవలని 144 పేజీల పాకెట్ సైజ్ బుక్ పరిమితికి రాసేవారు. దాన్ని నేటి నవలా పద్ధతిలో దాదాపు అంతకు రెట్టింపు చేసి ప్రధాన కథకి కొత్తవేం కలపకుండా అవే అధ్యాయాలని పెంచి రాసాను. వారు అనుకున్నట్లుగానే ఈ ప్రక్రియ వల్ల శ్రీరమణకి మంచి ప్రయోగం చేసిన ఎడిటర్‌గా పాఠకులలో గుర్తింపు వచ్చింది. ఎవరైనా కాలం రాయడం ఎందుకో శ్రీ రమణకి ఇష్టం ఉండేది కాదు

అనిపించింది. ఓసారి నాతో 'రావికొండలరావు కాలం రాస్తానంటున్నారు. కాలం రాయటం ఎంత కష్టమో' అన్నారు. అలాగే శ్రీ భరాగో తన ఆత్మకథ రాసానని ఓ సందర్భంలో నాతో చెపితే, దాన్ని నవ్యలో సీరియల్‌గా వేయచ్చేమో ఆలోచించమని శ్రీరమణకి సూచించాను. అందువల్ల అది ఎక్కువ మంది పాఠకులకి అందుతుందన్నది నా ఉద్దేశం. 'ఆయన గురించి నాకు తెలీంది కొత్తగా ఏముంది?' అని కొట్టిపారేసారు. రచయితగా శ్రీ రమణ నన్ను తగిన గౌరవంతో చూసేవారు. ఆయన రాసిన ' మిథునం' ఆయన్ని మంచి కథకుడిగా పై స్థానంలో కూర్చోపెట్టింది. వ్యక్తిగా కూడా ఆయన్ని పై స్థానంలో కూర్చోబెట్టాల్సిన మనిషి. లౌకికత్వం లేదు. అంటే హాని చేసే చెడ్డతనం లేదు. మనసు విప్పి స్వవిషయాలు చెప్పేంత దాపరికం లేని స్వభావం. మధ్యతరగతి బాధలు, సెంటిమెంట్లు ఆయనకి తెలిసినంతగా నాకు తెలీదు అనిపించేది. నవ్యకి నేను అడపా దడపా కథలు పంపితే ప్రచురించేవారు. తర్వాత ఐ. వెంకట్రావుగారు పెట్టిన మహా టీవీకి శ్రీరమణ వెళ్ళిపోయారు. వారిద్దరికీ ఆంధ్రజ్యోతిలో పనిచేసే రోజుల నుంచి పరిచయం.

## శ్రీ మదన్

ఆంధ్రప్రభ ఆఫీస్ అంతదాకా లోయర్ టేంక్ బండ్ రోడ్ లోని జె.బి.మంగారామ్ బిస్కెట్ ఫేక్టరీ పక్కన ఉండేది. దాన్ని అమ్మేసి ప్రభ ఆఫీస్‌ని రామకృష్ణా మఠం ఎదురుగా ఓ అద్దె బిల్డింగ్‌లోకి మార్చారు. డైలీలో స్నేహ అనే మహిళా పేజీని చూసే మదన్ అనే ఎడిటర్ ఇన్ -ఛార్జ్ నాకు 1999 ఆగస్ట్ ఆఖరి వారంలో పరిచయం. ఓ రోజు ఫోన్ చేసి లేడీస్ పేజీకి ఏదైనా రాయమని నన్ను కోరారు. ఓ వారంలో నేను గోవాకి వెళుతున్నానని, తిరిగి వచ్చాక ఏదైనా రాస్తానని చెప్పాను. తిరిగి రాగానే వారిని ఆ బిల్డింగ్ ఫస్ట్ ఫ్లోర్‌లో కలిసాను. అది మా ఇంటికి రెండు కిలోమీటర్ల దూరంలోనే ఉండేది. ఏం రాయాలి అని చర్చించుకుంటూంటే, 'మీరు రొమాన్స్ బాగా రాస్తారు కాబట్టి ఆ నేపథ్యంలో మీ నుంచి నేనేదైనా కోరుతున్నాను' అని ఒకటి రెండు అంశాలని మదన్ సూచించారు.

"కానీ అలాంటివి రాయడానికి డాక్టర్ సమరంలా నేను డాక్టర్‌ని కానుగా?" జవాబు చెప్పాను.

కొద్దిసేపు జరిగిన చర్చలోంచి సమరం టైప్ సెక్స్ వ్యాసాలని కథా రూపంలో రాస్తే బావుంటుందన్న సూచనని శ్రీ మదన్ నుంచి వచ్చింది. ఆ కథలు అన్నిటిలో ఓ ప్రధాన పాత్ర ఉంటే బావుంటుందని, అందువల్ల దానికి సిరీస్‌గా గుర్తింపు వస్తుందని నేను ప్రతిపాదించాను. అలా 'గుట్టు' అనే శీర్షికతో 'ఓ సెక్స్ సమస్య - దానికి ఓ పరిష్కారం'తో భువన ఆంటీ అనే పాత్రతో కొన్ని కథలను మోడల్‌గా రాసి తీసుకెళ్ళాను. అవి చదివి తను అలాంటివే కోరుకుంటున్నానని చెప్పారు. ఐతే మహిళా పేజీ కాబట్టి ఆడ పేరుతో రాస్తే బావుంటుందని చెప్పారు. మల్లాది వెంకట కృష్ణమ్మ పేరుని వాడమని చెపితే ఫక్కున నవ్వి, ఇంకేదైనా పేరుని సజెస్ట్ చేయమన్నారు. నా కలం పేరు డి.పద్మజ ఎటూ ఉండనే ఉంది కాబట్టి ఆ పేరుతో దాదాపు ఏడాది పాటు గుట్టు కథలు రాసాను. వాటికి పాఠకుల ఆదరణ ఊహించిన దానికన్నా ఎక్కువగా వచ్చింది. ఐదేళ్ళ తర్వాత నేను ఎడిట్ చేసే శృంగారం డాట్ కాంలోను, దాదాపు పదేళ్ళ తర్వాత పెళ్ళి పత్రిక అనే మాసపత్రికలో కూడా వాటిని పునర్ముద్రించారు. రెండేళ్ళ క్రితం లిపి పబ్లికేషన్స్ నుంచి అది పుస్తకంగా కూడా వెలువడింది. గుట్టు వ్యాసాల ద్వారా నాకు గణపతి సచ్చిదానంద స్వామి దర్శనం లభించడం ఓ వింత.




ఓ రోజు శ్రీ వాసుదేవ దీక్షితులు నాకు ఫోన్ చేసి శ్రీ కుప్పా కృష్ణమూర్తి అనే ఆయన గుట్టు వ్యాసాలని చదివారని, దాన్ని రాసిన వారి శైలి బావుంది కాబట్టి వారి చేత తను శ్రీ గణపతి సచ్చిదానందస్వామి మఠం తరపున ఎడిట్ చేసే భక్తి మాల అనే ఆధ్యాత్మిక పత్రికలో ఏదైనా రాయించాలని అనుకుంటున్నానని, డి.పద్మజ ఎడ్రస్ కనుక్కొని చెప్పమని తనని కోరారని, మదన్‌కి ఫోన్ చేస్తే వాటిని రాసేది నేనేనని చెప్పారని, నా ఫోన్ నంబర్ కుప్పాగారికి ఇచ్చానని నాతో చెప్పారు. శ్రీ దీక్షితులు

కొంత ఆధ్యాత్మిక ఆసక్తి ఉన్న మనిషి. శ్రీ కృష్ణమూర్తి అప్పట్లో మైసూర్‌లోని గణపతి సచ్చిదానంద స్వామి వారి ఆశ్రమంలోనే ఉండేవారు. వారు హైదరాబాద్ వచ్చినప్పుడు అబిడ్స్‌లోని వారి ఆఫీస్ నుంచి ఫోన్ చేస్తే వెళ్ళికలిసాను. డి.పద్మజ పేరుతో వాటిని రాసింది నేనేనని చెపితే కుప్పా కృష్ణమూర్తిగారు ఆశ్చర్యపోయారు. నన్ను ఆధ్యాత్మిక వల్ల నేనేం లాభం పొందానని ఆయన అడిగారు.

"నేను నా జీవిత కాలంలో చాలామంది శత్రువుల వల్ల బాధపడ్డాను. కానీ నా చర్యల వల్ల నేను బాధపడ్డట్లుగా నా శత్రువులెవరూ నన్ను బాధించలేదు అని తెలుసుకున్నాను." చెప్పాను.

"ఆధ్యాత్మిక జీవనంలోకి రాకపోతే మీకు ఈ సత్యం తెలిసేది కాదు." చెప్పారాయన.

అది నిజమే. ఇంతదాకా నేను కలిగించుకున్నంత కష్టాన్ని మరెవరూ నాకు కలిగించలేదు. నా పొరపాట్ల నుంచి నేను నేర్చుకున్నంత మరెవరూ నాకు నేర్పలేదు. దాంతో నేను ఎవర్నయినా ద్వేషించే స్థితి నుంచి బయట పడగలిగాను. దేవుడు, ముక్తిలాంటివి ఎలా ఉన్నా ఇది నాకు ఆధ్యాత్మికత ఇచ్చిన ప్రయోజనం.

ఆయన ఓ కాన్సెప్ట్ చెప్పి ఆ విధంగా తమ పత్రికకి రాయమని కోరారు. అది నేను ఆధ్యాత్మికతకి వచ్చిన కొత్త రోజులు కాబట్టి కాదనకుండా రాసాను. కాని ఆయనకి తృప్తి కలిగేలా వాటిని రాయలేకపోయాను. నేను రాసిన ఆ వ్యాసాలని శీర్షికగా కాక మామూలుగా తమ పత్రికలో ఆయన ప్రచురించారు. ఆ సందర్భంలో నేను మైసూర్ ఆశ్రమానికి వెళ్ళి స్వామి వారి దర్శనం చేసుకుని వచ్చాను. ఆ తర్వాత కుప్పాగారిని ఎడిటర్ పోస్ట్ నుంచి వేద ప్రచారానికి స్వామి వారు మార్చడంతో కుప్పా కృష్ణమూర్తి గారు సర్వ్ అనే వేద ట్రస్ట్‌ని మఠం తరఫున నిర్వహిస్తూ హైదరాబాద్‌కి మకాం మార్చారు. ఒకటి రెండుసార్లు నేను వారింటికి వెళ్ళి వారి దర్శనం చేసుకున్నాను. బంధువుల పెళ్ళిళ్ళల్లో కూడా వారు నాకు తారసపడ్డారు.

ఆంధ్రప్రభని ఆ సమయంలోనే గొయెంకాలు వేరే యాజమాన్యానికి అమ్మారు. ఐనా ఆంధ్రప్రభ నుంచి ఆలస్యంగా వచ్చినా, నేను చేసిన అన్ని రచనలకీ నాకు పారితోషికం వచ్చింది. గోయెంకాలు తమ అప్పులన్నీ తీర్చాలనే నిబంధనతో ప్రభని అమ్మారని ఎవరో చెప్పారు. ప్రస్తుతం విజయబాబు ప్రభ డైలీకి ఎడిటర్.

అతను పల్లకి ఆఫీస్‌లో తరంగిణి ఎడిటర్‌గా నాకు పరిచయం. ప్రభ ఎడిటర్ అయ్యాక తమకి ఏదైనా రాయమని కోరారు. నేను కొన్ని క్విజ్‌లని తయారు చేసి తీసుకెళ్ళి ఇచ్చాను. కొన్ని నెలలు గడిచినా వాటిని అతను వేయకపోవడంతో ఓ రోజు వెళ్ళి వెనక్కి తిరిగి తీసుకున్నాను. 2011లో అవి ఆంధ్రభూమి సిసింద్రీ పేజీలో వచ్చాయి.

***(వచ్చే సంచికలో మరి కొన్ని విశేషాలు)***

Click here to share your comments on this story